క్లుప్తంగా

అడిషనల్ ఎస్పీ (క్రైమ్)గా సర్కార్



ఎస్పీ జగదీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ సర్కార్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్)గా టి.సర్కార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వహించి, మంగళగిరి ప్రధాన కార్యాలయంలో వెయిటింగ్ ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో ఆ సమయంలో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పోటీలు

ప్రకాశం నగర్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. క్విజ్‌లో శ్రీ గౌతమి ప్రథమ, శ్రీచైతన్య టెక్నో ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వక్తృత్వ పోటీల్లో ఆర్.మీనాక్షి మొదటి, ఎంఎల్ ప్రసన్న రెండు, జి.శ్రీకాంత్ కుమార్ మూడో స్థానం సాధించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్ రజనీ, జాకోబ్, వెంకట్రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీపై సమావేశం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అధికారులను ఆదేశించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సమావేశపు హాల్లో శనివారం మున్సిపల్, పంచాయతీ, రిజిస్ట్రేషన్ అధికారులతో ధ్రువీకరణ పత్రాలపై జారీపై ప్రత్యేక సమావేశం, పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ జనన, మరణ, వివాహ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. వాటిని జారీ చేయడంలో ఏ విధమైన న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ మాట్లాడుతూ జనన మరణాల నమోదు చట్టంపై అవగాహన కల్పించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ.వినూత్న, సబ్ రిజిస్ట్రార్ కె.కమల ప్రియ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ విలియం కేరి మాట్లాడారు.

భవిత సెంటర్ల పనితీరుపై సమీక్ష

ప్రకాశం నగర్: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం జిల్లాస్థాయి భవిత సెంటర్ల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భవిత సెంటర్ల పనితీరు, విద్యార్థుల రోలు, హాజరు మెరుగుపడాలని, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవిత సెంటర్లను నిర్వహించాలన్నారు. రోలు తక్కువగా ఉన్న మండలాల్లో పెంచడానికి ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఐఈ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఎన్.కనక బాబు, అకౌంట్స్ ఆఫీసర్ స్నేహలత, సెక్టోరియల్ అధికారులు గౌరీ శంకర్, శ్రీనివాస్, సమగ్ర శిక్షా సూపరింటెండెంట్ ఎం.రమణ పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై అసత్య ప్రచారం చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని లాలాచెరువు బత్తిన నగర్‌కు చెందిన మామిడి లక్ష్మణరావు శనివారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భరత్ రామ్‌పై వారం రోజులుగా ఆయన ఫేక్ అకౌంట్‌తో సోషల్ మీడియాలోనూ, ఇతర మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. పలు ఆరోపణలతో పోస్టర్లు ముద్రించి నగరంలో పంచుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాజమహేంద్రవరంలో గొడవలు సృష్టించి, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ మేరకు త్రీటౌన్ ఎస్సై నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రిమూర్తులు తీర్థం ప్రారంభం

రాజానగరం: నరేంద్రపురంలోని త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) ఆలయంలో 77వ తీర్థ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. పొలాల మధ్య కొలువైన స్వామివార్లను దర్శించుకునేందుకు జిల్లాలోని భక్తులు భారీగా తరలివచ్చారు.

బోధనాస్పత్రిలో సమన్వయ లోపం

- ఇద్దరు ఆర్ఎంలు ఉన్నా వారి సేవలు శూన్యం
- ఇక్కట్లు పడుతున్న రోగులు



రాజమహేంద్రవరం బోధనాసుపత్రి

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి అంటే.. పేదల పాలిట ఆరోగ్యప్రదాయిని. నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తూ ఉంటారు. అదే స్థాయిలో వైద్య సేవలు ఉంటాయి. చిన్నపాటి సమస్యల నుంచి ప్రాణాంతక వ్యాధులకు సైతం వైద్య చికిత్సలు అందించి, మందులు సరఫరా చేస్తోంది ప్రభుత్వాస్పత్రి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చుతూ పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. ఏపీ వైద్య విధాన పరిషత్ విభాగంలో పనిచేసిన ప్రభుత్వాస్పత్రి.. రాజమహేంద్రవరానికి మెడికల్ కళాశాల రాకతో బోధనాస్పత్రిగా రూపాంతరం చెందింది. దీంతో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆస్పత్రికి పక్క జిల్లాల నుంచి సైతం రోగులు వస్తుంటారు. ఇక్కడ మాతా, శిశు ప్రత్యేక విభాగం ఉంది. సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఈ వైద్యసేవలన్నీ జరుగుతున్నాయి. లోపాలు ఏమైనా ఉంటే గుర్తించి, ఆమె వాటిని వెంటనే చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆర్ఎంవోల సేవలు శూన్యం

ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిగా ఉన్నప్పుడు ఆర్ఎంవో పోస్టు ఒకటి ఉండేది. ఆ పోస్టులో ఉన్న వారి పర్యవేక్షణలో వైద్య సేవలు, సౌకర్యాలు బాగుండేవి. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధనాస్పత్రిగా మారిన తర్వాత రెండు ఆర్ఎంవో పోస్టులు అందుబాటులోకి తెచ్చారు. ఇద్దరు వ్యక్తులు ఈ బాధ్యతలు నిర్వహిస్తుండడంతో గతంకన్నా మరిన్ని సౌకర్యవంతమైన సేవలు రోగులు అందాల్సివుంది. అయితే ఆ మాట అటుంచి ఇద్దరు ఆర్ఎంవోలు చేస్తున్న సేవలు ఏమీ లేవని ఆస్పత్రిలో వైద్యులు, రోగులు చెప్పకనే చెబుతున్నారు. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో) 24 గంటలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. ఇద్దరు ఆర్ఎంలు ఉన్న నేపథ్యంలో ఆ డ్యూటీలను రెండు విభాగాలుగా చేసుకోవాలి. అయితే అదేమీ లేకుండా ఆర్ఎంవోలు పేరుకే తప్ప విధుల నిర్వహణలో శూన్యమే అని చెబుతున్నారు. ఏదైనా అవసరం వచ్చి ఆర్ఎంవోల వద్దకు వెళితే వారు అందుబాటులో ఉండరు. వారికి ఇచ్చిన ఆసుపత్రి ఫోన్‌లు స్విచ్ ఆఫ్‌లోనే ఉంటున్నాయని రోగులు చెబుతున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, గదుల్లో సౌకర్యాలు, ఆస్పత్రిలో సేవల పర్యవేక్షణ బాధ్యత ఆర్ఎంవోలది. అయితే అవేమీ వీరికి పట్టినట్లు ఉండదు. ఏదైనా అవసరం వచ్చి ఆర్ఎంవోల వద్దకు వెళితే వారు అందుబాటులో ఉండరు. వారికి ఇచ్చిన ఫోన్లు స్విచ్ ఆఫ్‌లోనే ఉంటున్నాయని రోగులు చెబుతున్నారు. వీరిలో ఒకరు మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్. ల్యాబ్‌లో వైద్య విద్యార్థులకు పాఠాలు చెప్పాలి. అతను బోధనాస్పత్రిలో ఆర్ఎంవో విధులు నిర్వహిస్తున్నారు.

మార్పులు చేస్తున్నాం



బోధనాస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వారికి సేవ చేయడమే మా ప్రధాన కర్తవ్యం. దీనికి సంబంధించి పలు మార్పులు చేస్తున్నాం. ఆర్ఎంవోలు ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండాలి. దానికి సంబంధించి ఆ దిశగా ముందుకు వెళుతున్నాం. అలాగే ఆస్పత్రిలో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

– డాక్టర్ సూర్యప్రభ, బోధనాస్పత్రి సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో ప్రగతి వెలుగులు

- అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం
- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, ప్రగతి పథంలో నడిస్తున్నామని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో శనివారం సిటీ ముస్లిం మైనారిటీ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధిని అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు కుట్రలు పన్నుతున్నాయన్నారు. రాజకీయాలను అడ్డుపెట్టుకుని వడ్డీ వ్యాపారం చేస్తూ, సామాన్యుల ఆస్తులను లాక్కునే వారిని ఓడించాలని పిలుపు నిచ్చారు. గత దశాబ్దన్నర కాలంగా రాజమహేంద్రవరంలో మేయర్లుగా టీడీపీ నాయకులే ఉన్నారన్నారు. ఒకే కుటుంబంలో మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు పొందిన వారు.. నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. తాను ఎంపీగా ఈ 58 నెలల్లో చేసిన అభివృద్ధిని చూపిస్తాననని, అలాగే టీడీపీ నాయకులు చేయగలరా అని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే భరత్, భరత్ అంటే అభివృద్ధి అని నగర ప్రజలంతా ముక్త కంఠంతో అంటుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. అభివృద్ధి పనుల్లో తాను కమీషన్ తీసుకున్నానని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తూర్పు రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న పాత కబేళా స్థలం 30 సెంట్లలో షాదీఖానా నిర్మిస్తానన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలను రెండు, మూడు రోజుల్లో ఆ స్థలంలోనే అందజేస్తానన్నారు. ముస్లిం సోదరులంతా ఆశీర్వదించి మద్దతు ఇవ్వాలని కోరారు. సంఘ అధ్యక్షుడిగా ఎండీ ఆరీఫుల్లా ఖాన్ (చోటా ఖాన్), ఉపాధ్యక్షులుగా అల్తాఫ్, షేక్ జిలానీ, జాయింట్ సెక్రటరీగా ఎండీ అలీ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ షేక్ నిజామ్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఆరీఫ్, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ వజీర్, హబీబుల్లా ఖాన్, నయీం బాయ్, ఎండీ అక్రమ్ పాల్గొన్నారు.

మీ ఇంటి పెద్ద కొడుకును అవుతా

త్వరలో జరిగే ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే, మీ ఇంటి పెద్ద కొడుకులా బాధ్యతలు తీసుకుంటానని ఎంపీ మార్గాని భరత్ రామ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక 22వ డివిజన్‌లోని గోదావరి బండ్ రోడ్డు, కంభం వారి సత్రం వీధులలో శనివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, దూర్వాసుల సత్యనారాయణ, కొత్త బాల మురళీకృష్ణ, కొత్త విజయ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తుది శ్వాస వరకూ జగనన్న వెంటే..

తన బొందిలో ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీని, జగనన్నను విడిచే ప్రసక్తే లేదని ఎంపీ మార్గాని భరత్ రామ్ స్పష్టం చేశారు. శనివారం సోషల్ మీడియాలో వచ్చిన వార్తను ఖండించారు. దానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీ మాట్లాడుతూ తాను పార్టీ మారాల్సిన అవసరం లేదన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జగనన్న 2019 ఎన్నికలలో ఎంపీగా అవకాశం ఇచ్చారని, అత్యధిక మెజారిటీతో గెలిచానన్నారు. అదే అభిమానంతో రానున్న ఎన్నికలలో (2024) రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ స్థానం నుంచి పోటీ చేయమని జగనన్న ఆదేశించారన్నారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శ్రమిస్తున్నానన్నారు.

శెట్టిబలిజ అభ్యర్థులను గౌడ అని చెప్పడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

సీటీఆర్ఐ: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరపున పోటీ చేయనున్న శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను చాలా యూట్యూబ్ చానళ్లలో గౌడ కులానికి చెందిన వారంటూ అవగాహన లేకుండా చెబుతున్నారని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. సంఘం నాయకులతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శెట్టిబలిజ అనేది ఒక ప్రత్యేక కులమని, అది తెలుసుకోకుండా యూట్యూబ్ చానళ్లు తోచిన రీతిలో ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. తెలియక చెబుతున్నారా? లేక ఎవరైనా ఇలా చెప్పిస్తున్నారా అన్న అనుమానం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున రామచంద్రపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానాల్లో శెట్టిబలిజ అభ్యర్థులు పోటీ చేస్తుంటే, గౌడ కులానికి చెందిన వారని చెబుతున్నారన్నారు. సంఘ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, బత్తిన ఏడుకొండలు, బత్తిన ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తొస్సిపూడి శివారు ప్రాంతంలో పందలపాక గ్రామానికి చెందిన ఎనిమిది మంది పేకాట ఆడుతుండగా పట్టుకుని అరెస్టు చేశామనా, వారి వద్ద నుంచి రూ.11,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అత్యాధునికంగా ప్రధాన రైల్వేస్టేషన్

- అభివృద్ధికి రూ 269.64 కోట్లు మంజూరు
- రేపు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ మూడేళ్లలో అత్యంత అధునాతనంగా మారబోతోందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.269.64 కోట్లు మంజూరయ్యాయన్నారు. దీనికి సంబంధించి పునరాభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వేస్టేషన్‌ను కాస్త ముందుకు అంటే ఐదుబళ్ల మార్కెట్ వద్దకు ప్రధాన ముఖద్వారం వచ్చేలా అత్యంత అద్భుతమైన ఫైవ్ స్టార్ రేంజ్ భవనం రాబోతోందన్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు ఒక అంతస్తు, మల్టీ షాపింగ్ మాల్‌గా ఒక అంతస్తు, ప్రయాణికులు అల్పాహారం, భోజనం చేసేందుకు ఒక హోటల్, దూర ప్రయాణాలకు వసతి సౌకర్యాలతో గదులు. ఇలా అన్ని రకాల సౌకర్యాలతో రైల్వే స్టేషన్ భవనం ఆవిష్కృతం కానుందన్నారు. రైల్వే స్టేషన్‌కు తాజాగా 4, 5 ప్లాట్‌ఫాంలు తీసుకువచ్చామన్నారు. ఆరోవది కూడా రానుందన్నారు. గోదావరిపై ఉన్న ఆర్చ్ వంతెన డిజైన్‌లో నగర రైల్వే స్టేషన్ కొత్త భవనం వెలివేషన్‌తో నిర్మించనున్నారన్నారు. పార్లమెంటులోనూ, ప్రత్యేకంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి విన్నవించగా ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించారన్నారు. ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి చిరునామాగా రాజానగరం

- మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్
- సీతానగరం మండలంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవం



రఘుదేవపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్

సీతానగరం: రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా నిలిచిందని మాజీ మంత్రి, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ కొనియాడారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌తో కలిసి నియోజకవర్గంలో శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రఘుదేవపురంలో రూ.8 కోట్లుతో నిర్మించే 30 పడకల ఆసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి శంకుస్థాపన, సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో రూ.2.45 కోట్లతో నెలకొల్పిన క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రజలకు అండగా జక్కంపూడి రాజా

అనంతరం జరిగిన సభలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు అత్యంత ఆప్తులుగా ఉండేవారన్నారు. ఇప్పుడు జక్కంపూడి రాజాను సీఎం జగన్ ఎంతో ఆప్యాయంగా చూసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ నైనా జైస్వాల్ చదువుతో పాటు టెన్నిస్‌లో రాణిస్తూ దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారన్నారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆయన ఒక్కరికి ఓటు వేసి గెలిపిస్తే, నలుగురం మీ సేవలో ఉంటామని తెలిపారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. పారిశ్రామిక వృద్ధి రేటులో దేశంలో మూడోస్థానంలో ఉన్నామన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు.

ఉత్సాహంగా బైక్ ర్యాలీ

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకూ బైక్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. అడుగడుగునా ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. సుమారు ఐదువేల మంది బైక్‌లపై వచ్చి ర్యాలీగా సీతానగరం చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



హోటల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం, కల్తీ సరకులతో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. పిడింగొయ్యి పరిధిలోని హైఫామ్స్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన జురా హోటల్‌ను శనివారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ హోటల్‌లో గడువు ముగిసిన రెండు రకాల ఆహార పదార్థాల ప్యాకెట్లను గుర్తించి, కేసు నమోదు చేశారు. అక్కడి చికెన్ ధమ్ బిర్యానీ నమూనాలను విశ్లేషణ కోసం నాచారంలోని ఫుడ్ లాబొరేటరీకి పంపిస్తామన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మీటర్ రీడింగ్ 25 శాతం లోపు మాత్రమే ఉండాలని, అయితే అంతకుమించి ఉంటున్నాయన్నారు. అటువంటి ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు.

వర్క్ ఫ్రం హోమ్ పేరుతో రూ.3.97 లక్షల మోసం

రాజమహేంద్రవరం రూరల్: వర్క్ ఫ్రం హోమ్ పేరుతో వచ్చిన యాడ్ చూసి ఓ యువతి రూ.3.97 లక్షలు మోసపోయింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటిలింగాలపేటకు చెందిన ఎం.అపర్ణకు మొబైల్‌లో రీల్స్ చూస్తుండగా వర్క్ ఫ్రం హోమ్ అవకాశం ఉందంటూ యాడ్ కనిపించింది. ఇంటి వద్దే ఉండి పనిచేస్తూ సొమ్ములు సంపాదించుకోవచ్చని ఆ ప్రకటన సారాంశం. సదరు యాడ్‌లోని ఫోన్ నంబర్‌కు మెసేజ్ చేస్తే, అటు నుంచి ఒక లింక్ వచ్చింది. ఆ లింక్‌పై టచ్ చేస్తే మూడు ప్రశ్నలతో టాస్క్ రావడంతో అపర్ణ తన బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేసింది. రూ.150 నుంచి మొదలైన సొమ్ములు పంపడం రూ.లక్షల వరకూ వెళ్లింది. మొత్తం రూ.3,97,000 పంపించి మోసపోయానని అపర్ణ త్రీటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపింది. త్రీటౌన్ ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బల్క్‌మిల్క్ యూనిట్ పరిశీలన

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో నిర్మిస్తున్న బల్క్‌మిల్క్ యూనిట్‌ను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.16 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. త్వరితగతిన విద్యుత్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనిట్‌కు రూ.10 లక్షలతో యంత్ర పరికరాలు కొనుగోలు చేసిందని, త్వరలో ఇక్కడ పాల సేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఈ యూనిట్ పరిధిలో 46 జగనన్న పాలవెల్లువ పాల సేకరణ కేంద్రాలున్నాయన్నారు. ఆయన వెంటన పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్, జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి ఎస్‌వీవీఎస్ మూర్తి, కోరుకొండ ఏడీ పి.ప్రభావతి పాల్గొన్నారు.

నాడు - నేడు పనులపై ఆరా

రాజానగరం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మన బడి నాడు – నేడు పథకం పనులను ఏపీ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ యనమల నాగార్జున శనివారం పరిశీలించారు. ఫేజ్ 1, 2లలో మంజూరైన నిధులతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించారా, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారా, పనుల నాణ్యత తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఈఈ జయకర్, జేఈ భీమశంకరం, ఎంఈఓ 2 జ్యోతి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీత్రయం వెంకన్న తీర్థం

పెదపూడి: మండలంలోని ఏపీత్రయం గ్రామంలో వెంకన్నబాబు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామంతో పాటు కరకుదురు, దోమాడ, రామేశ్వరం పరిసర గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ అడబాల అనురాధ, సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన తదితరులున్నారు.